# గాంధీ వెళ్లిపోయాడు.

## మనకు దిక్కెవరు?

సేవాగ్రామ్, మార్చి 1948

నెహ్రూ, ప్రసాద్, ఆజాద్
వినోబా, కృపలాని, జెపి,
తదితరుల అంతర్మథనం

సంకలనం

**గోపాలకృష్ణ గాంధీ**

ఇంగ్లీషు నుంచి తెలుగు అనువాదం

**వాడ్రేవు చినవీరభద్రుడు**

ఎమెస్కో

# విషయసూచిక



**సంపాదకుడి మాట** ... 15

**ప్రస్తావన** ... 16

**చర్చలో పాల్గొన్నవాళ్లు** ... 20

**ప్రారంభ చర్చ** ... 31

గురువారం, 11 మార్చి 1948, ఉదయం, మధ్యాహ్నం

గాంధీ వెళ్లిపోయాడు, కొత్త ప్రభుత్వం – మన ప్రభుత్వం – బాధ్యతలు స్వీకరించింది. అహింసా విశ్వాసులమైన మనమిప్పుడేం చేయాలి – మన విశ్వాసం దృఢంగా ఉందా – అలాకాక మరోలా ఉండగలమా – ప్రభుత్వాలు హింసను అణచివేయాలి – మన ప్రభుత్వం కూడా అందుకు భిన్నం కాదు – మన పాత్ర ఎలా ఉండాలి – పోరాటం రాజ్యం చేస్తుంది, మనం ప్రజలకు అహింసలో తర్ఫీదు ఇద్దామని కొందరు. వినోబా తన గురించి మాట్లాడుతూ తాను కార్యసంరంభం కన్నా ధ్యానపూర్వక నిష్క్రియనే ఇష్టపడతానన్నాడు.

గాంధీజీ ప్రారంభించిన నిర్మాణాత్మకకార్యక్రమసంస్థల భవిష్యత్తు ఏమిటి. వినోబా. రాజేంద్రప్రసాద్, కాలేల్కర్, కుమారప్ప తదితరుల ఆలోచన 'మనమొక సమగ్ర ధ్యేయంతో కూడిన కొత్త సంస్థగా రూపొందుదామని ఒక సూచన – మనమొక సంస్థగా కాక, సౌభ్రాతృత్వంగా నిలబడదామని వినోబా – మనం నిర్మాణాల్లో, నియమనిబంధనల్లో, పదవుల్లో, పదవీబాధ్యతల్లో కూరుకుపోవద్దు – అటువంటి వాటివల్ల ఉపయోగం లేదంటున్నాడాయన – అందుకు బదులు గాంధేయ ఆలోచనాసరళిననుసరించేవారంతా వారి ఇష్టప్రకారం కలుసుకునే మేళా చాలంటాడు – అలాకాదు ఆచరణాత్మకంగా మాట్లాడుకుందాం – అంటాడు కాలేల్కర్ – మన కాళ్లు నేలమీద దృఢంగా ఆనాలంటాడు కుమారప్ప.

**సమావేశ క్రమంలో ...** 40

శుక్రవారం 12, మార్చి 1948

ఉదయం

వినోబా ప్రతిపాదించిన సౌభ్రాతృత్వం మీద సునిశిత చర్చ. వాదోపవాదాలంతా విన్నారు – మరీ సరళంగా ఉండే సౌభ్రాతృత్వం వల్ల అహింసాపోరాటం, నిర్మాణాత్మక కార్యక్రమాలు ముందుకు పోగలవా అని రాజేంద్రప్రసాద్, జాకీర్‌హుస్సేన్ అనుమానం వ్యక్తం చేశారు – అటువంటి సారళ్యంలోనే దృఢత్వముందన్నారు కొందరు. మరీ వదులుగా ఉండటమంటే అసమర్థతే అన్నారు మరికొందరు – దానికి కాంగ్రెసుతో ఎటువంటి అనుబంధం ఉండాలని కొందరడిగితే, కొత్త ప్రభుత్వంతో దాని సంబంధాలెలా ఉండాలని మరికొందరడిగారు – ఈ రెండు ప్రశ్నలూ ఒక్కలాంటివేనని రాజేంద్రప్రసాద్ అన్నారు. కాంగ్రెసుకు బదులుగా లోక్‌సేవాసంఘ్ ఏర్పడాలన్నది గాంధీజీ చివరి కోరికంటూ ప్యారేలాల్ సభకు గుర్తు చేశారు – ప్రభుత్వానికీ, రాజకీయాలకీ ఆవల పట్టించుకోవలసిన విషయాలెన్నో ఉన్నాయని కుమారప్ప అన్నారు – అహింస, క్షేత్రస్థాయిలో అభివృద్ధి, వ్యవసాయం, కుటీరపరిశ్రమలు – లోక్‌సేవాసంఘమే మనకు బాపూగా మారాలి అన్నారాయన.

శుక్రవారం 12 మార్చి, 1948

మధ్యాహ్నం

మౌలానా ఆజాద్ చర్చలో పాల్గొన్నారు – నిర్మాణాత్మక కార్యక్రమాల కోసం కొత్త సంస్థ కావాలన్నారు – దానికీ, వినోబా ప్రతిపాదిస్తున్న సౌభ్రాతృత్వానికీ మధ్య భావజాలసారూప్యత ఉండాలన్నారు.

జయప్రకాష్ వినోబా పట్ల గౌరవం ప్రకటిస్తూనే ఆయనతో విభేదించారు – పటిష్ఠంగా లేనిదీ, బలంగా ఏర్పడనిదేదీ నిలబడదంటాడు జెపి – మనకు కావలసింది విస్పష్టమైన, సందర్భానుసారమైన, ఆత్మపరిశీలనాత్మకమైన, ఆత్మస్ఫోరకమైన వ్యవస్థ. గాంధీజీ చేసి చూపించినట్లుగా అది ఎప్పటికప్పుడు ఏరోజుకారోజు కొత్త ప్రశ్నలు ఎదుర్కోగలిగేటట్టు కూడా ఉండాలి – అలా చేస్తే గాంధీ మళ్లా యువతరం కోసం పునర్జీవిస్తారన్నారాయన – అప్పుడు చర్చలో మరిన్ని వివరాలమీద, సూక్ష్మాంశాలమీద, భావప్రకటనలమీద దృష్టి పెట్టారు – ఈ విషయంలో గాంధీజీ ఒక పెద్ద చిత్రం కూడా గీశారు. దాన్ని మనం మరచిపోకూడదు అని ఆచార్య కృపలానీ వారందరికీ గుర్తు చేస్తారు.

**ఉపసంఘ సమావేశం** ... 53
శుక్రవారం, 12 మార్చి 1948
రాత్రి

ఉపసంఘసమావేశం – అదొక మేళా అయినా కాకపోయినా కొత్త సంస్థ అంటూ ఒకటి ఏర్పడాలని స్పష్టపడింది – దానికేం పేరు పెట్టాలి. రకరకాల పేర్ల గురించి కొంత హాస్యసంభాషణ జరుగుతుంది – తనదైన వ్యంగ్యశైలిలో కృపలానీ మళ్లా అందరికీ పెద్ద చిత్రం గురించి గుర్తు చేస్తాడు.

**సమావేశ ప్రారంభం** ... 57
శనివారం 13 మార్చి, 1948
ఉదయం

దాదా ధర్మాధికారి అధ్యక్షతన ఒక బృందం లక్ష్యాలగురించీ, నిర్దిష్ట కార్యక్రమాలు గురించీ స్థూలంగా రూపొందించిన ప్రతిపాదనలు ధర్మాధికారి చదివి వినిపిస్తారు – సరికొత్త గాంధేయ సంస్థ సమగ్ర కార్యాచరణకు రూపొందించిన సవివరచిత్రపటమది – ఆశలు రేకెత్తాయి కాని వినోబా మౌలికంగా విభేదిస్తాడు – ఎటువంటి నియమనిబంధనలూ లేకుండా మేళా రూపంలో కలుసుకునే సౌభ్రాతృత్వం గురించి తన ఆలోచనలు మళ్లా ప్రకటిస్తాడు.

ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రానున్నారు – పోలీసు బందోబస్తు మీద కృపలాని అభ్యంతరం ప్రకటిస్తాడు, సమావేశకర్త ధోత్రే నిస్సహాయత ప్రకటిస్తాడు – సగౌరవ స్వాగతం మధ్య నెహ్రూ ఆగమనం – నిర్మాణాత్మకసంస్థలకార్యకర్తలు తమ సమస్యలు విన్నవిస్తారు, గత రెండు దినాల చర్చల సారాంశాన్ని ప్రసాద్ వివరిస్తాడు – నెహ్రూ ప్రతిస్పందన, గుండె బరువు దింపుకుంటాడు. బాపూ గురించి నిబ్బరంగానూ, భావోద్వేగంతోనూ మాట్లాడతాడు. తన కొత్త పదవీబాధ్యత తనకు రుచించటం లేదనీ, కానీ దాన్ని తానొక కర్తవ్యంగా స్వీకరిస్తున్నాననీ చెప్తాడు – స్థానిక దృక్పథాన్నీ, ప్రపంచ దృక్పథాన్నీ కూడా తనదైన చారిత్రకవిజ్ఞతతో ప్రతిపాదిస్తాడు – సరళమైన, సాధారణమైన హిందుస్తానీలో మాట్లాడతాడు – యుద్ధం గురించీ, శాంతి గురించీ, నియంత్రణ గురించీ, నియంత్రణలు తొలగించడం గురించీ, ప్రణాళికల గురించీ మాట్లాడతాడు – మతోన్మాదం, లౌకికవాదం – కాందిశీకులు, కలహాలు, హింస – తక్కినవారితో అంగీకరిస్తాడు, విభేదిస్తాడు, తననుంచి మార్గదర్శకత్వమేదీ ఆశించవద్దని వారికి చెప్తాడు – అయితే ఒక సహచరుడిగా మాత్రం తానెప్పుడూ వారికి అందుబాటులో ఉంటానంటాడు – వినోబా

ప్రతిస్పందన, జవహర్‌లాల్ బాపూ ఎంపిక చేసిన బాపూ వారసుడు, కాబట్టి గాంధీ మార్గమంటే ఏమిటో అతడు వివరించి తమనుంచి ఏమాశిస్తున్నాడో చెప్పాలంటాడు – నా నుంచి నువ్వేమాశిస్తున్నావని నెహ్రూనే అడుగుతాడు వినోబా – నెహ్రూ ఏది ప్రతిపాదిస్తే తానది పాటించడానికి సిద్ధపడతాడు.

**బహిరంగ సమావేశం 1** ... 78
శనివారం, 13, మార్చి 1948,
మధ్యాహ్నం

రాజేంద్రప్రసాద్ అధ్యక్షత, వినోబా నాందీ ప్రస్తావన – పండిట్ నెహ్రూ తన హృదయం విప్పి పరుస్తాడు – మౌలానా ఆజాద్ విజ్ఞప్తి – రోగగ్రస్త హిందూస్తాన్ పెదాలమీద బాపూ అనే రెండక్షరాల ఔషధముంచాలని ప్రార్థన.

సాయంకాలం

నెహ్రూ, ఆజాద్ సెలవు తీసుకుంటారు – అక్కడ సమావేశమైన వారందరిమీదా నెహ్రూ, వినోబా ఇద్దరూ అద్వితీయ ప్రభావం చూపించారు – కాని తన సాధారణభావోద్వేగంతో కృపలాని విభేదిస్తాడు. గాంధీని వ్యాఖ్యానించడంలో ఏ ఒక్కరికో మాత్రమే అధికారం లేదంటాడు – నెమ్మదిగా మొత్తం సమావేశంలో ఒక నిశ్చలకేంద్రంగా వినోబా అవతరిస్తున్నాడు.

**బహిరంగ సమావేశం 2** ... 90
ఆదివారం 14 మార్చి, 1948
ఉదయం

మనందరి దృష్టి వినోబా వైపే అంటాడు శంకర్‌రావ్‌దేవ్. తప్పదన్నట్లుగా వినోబా వేదిక స్వీకరిస్తాడు – ఆ సందర్భంగా తన వచోమాధురితో కృపలాని ప్రసంగిస్తాడు.

**అజెండా కమిటీ సమావేశం** ... 97
ఆదివారం 14 మార్చి, 1948
మధ్యాహ్నం

సుచేత కృపలాని, మృదుల సారాభాయి, అంతుస్సలామ్ సమ్మేళనం దృష్టిని తక్షణ జీవన్మరణ సమస్యలవైపు తీసుకొస్తారు – సమ్మేళనం ముఖ్యమైన విషయాలమీద కాక, అత్యవసర విషయాలపైన చర్చించేటట్టు చేయడంలో జయప్రదమవుతారు – అక్కడ సమావేశమైన వారందరికీ బయట దేశంలో రగులుతున్న సమస్యలు గుర్తు చేస్తారు : కాందిశీకులు,

అపహరణకు గురైన స్త్రీలు, మతవిద్వేషం – కార్యాచరణకు తీర్మానాల ప్రతిపాదన, మార్పులు–చేర్పులు, కొన్ని విషయపరంగా, కొన్ని వాక్యనిర్మాణపరంగా.

**అజెండా కమిటీ సమావేశం** ... 105

సోమవారం 15 మార్చి, 1948

ఉదయం

సమావేశం పునఃప్రారంభం – కాందిశీకుల సమస్యపైన, హిందూముస్లిం సమస్యపైన రాజేంద్రప్రసాద్ చర్చ ప్రారంభిస్తారు – గాంధేయమార్గాన్ని, వినోబా, ఆర్.ఎస్.ఎస్ మార్గంతో పోల్చి తేడాలు వివరిస్తారు.

**బహిరంగ సమావేశం 3** ... 111

మధ్యాహ్నం

చర్చల్లో కృపలాని కీలకపాత్ర – అత్యంత వ్యంగ్యభరితప్రసంగం – వినోబా ప్రతిస్పందన – అత్యంత వివేకవంతప్రసంగం – ఏదైనా ఏకాభిప్రాయం సాధ్యపడిందా? – నిర్మాణాత్మక కార్యకర్తలు నిస్సందేహంగా వినోబాలో ఒక నేతను 'కనుగొన్నారు' – సర్వోదయ సమాజం, సర్వసేవాసంఘ్, శాంతిసేన రూపుదిద్దుకుంటున్నాయి – కాని ఏకాభిప్రాయానికి చేరుకున్నారా? ప్రశ్నలన్నిటిలోనూ ప్రధానమైన ప్రశ్నకు జవాబు దొరికిందా? – గాంధీ ఇకలేడు కాని గాంధీ రాజకీయ వారసత్వం, ఆయన 'ఆధ్యాత్మిక', 'నిర్మాణాత్మకదర్శనం' మనకు దారి చూపే విధంగా ఇక్కడ సేవాగ్రాంలో సంగమించగలిగాయా? – చర్చలు ముగింపుకొస్తున్నాయి – ధర్మాధికారి వందన సమర్పణ – అధ్యక్షస్థానంనుంచి రాజేంద్రప్రసాద్ చర్చలకు ముగింపు పలికారు – ఒక కార్యక్రమం ముగిసింది. కాని కొత్తదేదైనా ప్రారంభమైందా?

**మలిమాట** ... 122

సేవాగ్రాం సమావేశంలో పుట్టి ఆరు దశాబ్దాల తర్వాత కూడా మనకు స్ఫూర్తినందిస్తున్న ఈ సంస్థల గురించి ఠాకుర్‌దాస్ బంగ్, ఆత్మారామ్ సరావగీ వివరిస్తున్నారు.

**చర్చ కొనసాగిద్దాం** ... 131

# సంపాదకుడి మాట



1948లో సేవాగ్రాంలో జరిగిన 'రచనాత్మక కార్యకర్తాసమ్మేళన్' వారి చర్చల నివేదిక హిందీలో రాయబడింది. ఇంగ్లీషులోకి అనువదించినప్పుడు దాన్ని దాదాపు మూడోవంతుకి కుదించడం జరిగింది. వాక్యనిర్మాణానికి సంబంధించి అక్కడక్కడ చేసిన చిన్నచిన్న మార్పుల మినహా కొత్త పదాలేవీ చేర్చలేదు. ఆలోచనాధార సంభాషణాత్మకంగా ఉండటంకోసం చర్చలో పాల్గొన్నవాళ్లు చేసిన ప్రతిపాదనల్ని సమావేశాలవారీగా పొందుపరచడం జరిగింది. సేవాగ్రాం సమావేశంలో చాలామంది పాల్గొన్నారు. కాని వారందరి ప్రతిపాదనల్నీ, అభిప్రాయాల్నీ సంగ్రహీకరించడం సాధ్యంకాలేదు.

ఈ సంభాషణలను ఇంగ్లీషులోకి అనువదించింది గోపాలకృష్ణగాంధీ. ఇందులో జవహర్‌లాల్ నెహ్రూ, వినోబాభావే, జె.బి. కృపలానిల అభిప్రాయాల్ని రూపర్ట్‌స్నెల్ అనువదించారు.

ఈ కార్యక్రమం చేపట్టడానికి అనుమతించినందుకు గాంధీ సేవాసంఘ్‌కు సంపాదకుడు ధన్యవాదాలు చెప్పుకుంటున్నాడు. శ్రీ ఆత్మారాం సరావగి, శ్రీ నారాయణ దేసాయి, శ్రీ శైలేశ్ బందోపాధ్యాయ, శ్రీ కనకమల్ గాంధీ, శ్రీ సుప్రియా ముంషిలకు వారి అభిప్రాయాలకుగాను ధన్యవాదాలు చెప్పుకుంటున్నాడు. జీవనవృత్తాంతాల సమాచారమందించినందుకు శ్రీ ఠాకుర్‌దాస్ బంగ్, సాబర్మతి సంగ్రహాలయానికి చెందిన శ్రీ అమృత్‌భాయ్‌మోదీ, శ్రీ కిన్నరి, శ్రీ ఇ.ఎస్.రెడ్డి, గాంధీ స్మారకనిధి కార్యదర్శి శ్రీ రామచంద్ర రాహి, శ్రీ వేణుమాధవ్ గోవింద్‌లకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాడు. 1948 మార్చిలో ఈ చర్చలు జరిగినప్పుడు వీటిని నమోదుచేసిన ఆ అజ్ఞాత స్టెనోగ్రాఫర్ల అమూల్యశ్రమకు కూడా ధన్యవాదాలు చెప్పుకోవాలి. అలాగే సంపాదకుడి వ్యక్తిగత సహాయకుడు శ్రీ తుహిన్‌కుమార్ ముఖోపాధ్యాయ ఈ మొత్తం సంగ్రహాన్ని తనొక్కడే టైపు చేశాడు. అందుకతడికి కూడా ధన్యవాదాలు తెలియచేయాలి.

# చర్చలో పాల్గొన్నవాళ్లు



**శ్రీమన్నారాయణ అగ్రవాల్** (1912-78). వార్ధా వాణిజ్యవిశ్వవిద్యాలయంలో ప్రాచార్యులు, ప్రణాళికాసంఘం సభ్యులు, నేపాల్‌లో భారతరాయబారి, గుజరాత్ గవర్నర్, గాంధీస్మారకనిధి అధ్యక్షులు, 'గాంధీయన్‌ప్లాన్', 'గాంధీయన్ కానిస్టిట్యూషన్' అనే పుస్తకాల రచయిత. 1950ల్లో తన పేరులోంచి 'అగ్రవాల్' తొలగించుకున్నారు.

**బీబీ అంతుస్సలామ్** (1907-85). పటియాలకు చెందిన ప్రముఖ ముస్లిం కుటుంబంలో జన్మించారు. 1930-01లో గాంధీని కలిసారు. ఆయన ఆశ్రమ'కుటుంబం'లో భాగమయ్యారు. హిందూ ముస్లిం ఐక్యతకోసం కృషి చేశారు. తన మతగ్రంథాల్లో సంపూర్ణ అభినివేశంతోపాటు గురుగ్రంథసాహెబ్ కూడా పఠిస్తుండేవారు. భగవంతుడి గురించి తనకేర్పడ్డ దృక్పథానికీ, సత్కార్యాచరణకీ 'జోన్ ఆఫ్ ఆర్క్' తరహాలో సర్వస్వం సమర్పించగల ధీశాలి.

**ఆశాదేవి ఆర్యనాయకం** (1892-1969). అలహాబాదులో ఒక కళాశాలలో ఆచార్యులు. తరువాత 1930లో శాంతినికేతన్‌లో పాఠభవన్‌లో ఉపాధ్యాయులుగా చేరి ఆ పాఠశాలకు 1933 దాకా అధ్యక్షులుగా పనిచేశారు. తన భర్త ఇ.డబ్ల్యు. ఆర్యనాయకంతో కలిసి 1937లో మహాత్ముడి పిలుపుమేరకు సేవాగ్రాం వెళ్లి అక్కడ నయీతాలీమ్ కోసం కృషిచేశారు. కొంతకాలంపాటు 'హరిజన్' పత్రిక సంపాదకబాధ్యత నిర్వహించారు. 1954 నుండి వినోబాతో కలసి భూదానోద్యమ పర్యటనలు చేపట్టారు.

**ఇ.డబ్ల్యు. ఆర్యనాయకం** (1889-1967). జాఫ్నాకు చెందిన తమిళసంతతి శ్రీలంక క్రైస్తవుడు. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. కొన్నాళ్లపాటు ఇంగ్లాండులో యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్‌లో పనిచేశారు. టాగూర్ విద్యాదర్శాలకు ఆకర్షితుడై 1924-34 మధ్య శాంతినికేతన్‌లో పాఠభవన్‌లో బోధించారు. అక్కడి శిశువిభాగం

బాధ్యతలు 1926 నుండి స్వయంగా చూశారు. కొంతకాలం టాగూర్‌కు కార్యదర్శిగా పనిచేశారు. తరువాత గాంధీజీ ఆదర్శాలకు ఆకర్షితుడై తన భార్య ఆశాదేవితో కలిసి సేవాగ్రాం వెళ్లి నయితాలీమ్ కార్యక్రమం చేపట్టారు. హిందూస్థాని తాలీమీసంఘ్‌కు కార్యదర్శిగా పనిచేశారు.

**మౌలానా అబుల్‌కలాం ఆజాద్** (1888–1958). సర్వోత్కృష్ట పండితులు. 'అల్‌హిలాల్' అనే ఉర్దూ పత్రికకు సంపాదకులు. ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్నారు. భారతజాతీయ కాంగ్రెసులో చేరారు. 1923లో 1940లో రెండుసార్లు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. భారతదేశానికి మొదటి విద్యామంత్రి. మరణానంతరం 1992లో భారతరత్న సత్కారం లభించింది.

**కమల్‌నయన్ బజాజ్** (1915–72). జమ్నాలాల్ బజాజ్ పెద్దకొడుకు. స్వయంగా ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త. 1957–70 మధ్యకాలంలో వార్ధానుండి లోక్‌సభలో సభ్యులుగా ఉన్నారు. 1930లో దండియాత్రలో పాల్గొన్నారు. 1932లో విదేశీ వస్త్ర దుకాణాలవద్ద, మద్యం దుకాణాలవద్ద ఆందోళన చేసినందుకుగాను ఆరునెలలు కారాగారశిక్ష అనుభవించారు. ఎన్నో ఏళ్లపాటు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి కోశాధికారిగా పనిచేశారు.

**రాధాకృష్ణ బజాజ్** (1905–2000). జమ్నాలాల్ బజాజ్ మేనల్లుడు. తన యవ్వనకాలం నుంచి గాంధీ సాహచర్యానికి అంకితమయ్యారు. వ్యాపారం వదలిపెట్టి ఖాదీ, స్త్రీజనోద్ధరణ, గ్రామీణాభివృద్ధి, సర్వోదయ, గోసేవలు చేపట్టారు. సహాయనిరాకరణోద్యమంలో, జైపూర్ సత్యాగ్రహంలో, 1942లో క్విట్‌ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. వార్ధా జిల్లాలో గ్రామాల్లో గ్రామీణపరిశ్రమల ఉద్యమవ్యాప్తికి చాలా కృషి చేశారు. అఖిలభారత గోసేవ సంఘానికి, అఖిలభారత సర్వసేవాసంఘ్ ప్రచురణలకు అధ్యక్షుడుగా పనిచేశారు. సర్వోదయ కార్యకర్త. భూదాన, గ్రామదాన, గ్రామస్వరాజ్ ఉద్యమాల్లో చాలా కీలకపాత్ర పోషించారు.

**ఆచార్య వినోబా భావే** (1895–1982). జ్ఞాని, ఋషి. గాంధీకి ఆధ్యాత్మిక వారసులుగా నలుగురిచే కొనియాడబడ్డవారు. 1916 జూన్ 7న సాబర్మతి ఆశ్రమానికి వచ్చారు. 1940లో మొదటి వ్యక్తి సత్యాగ్రహిగా గాంధీచే ఎంపిక కాబడి శాసనోల్లంఘన ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. భూదాన, గ్రామదాన, గ్రామస్వరాజ్ ఉద్యమాల ప్రారంభకులు. గాంధేయ సిద్ధాంతాలవ్యాప్తికీ, భూమిలేని నిరుపేదలకు దానాలరూపంలో భూమి సేకరించడానికీ 60,000 కిలోమీటర్లు పైబడి నడిచారు. ఆయన ప్రసంగాలు డజన్లకొద్దీ పుస్తకాలుగా ప్రచురించబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి 'టాక్స్ ఆన్ ద గీత', 'థాట్స్ ఆన్ ఎడ్యుకేషన్',

'ఖురాన్', 'ఎస్సెన్స్ ఆఫ్ క్రిస్టియన్ టీచింగ్'. పరమధామ్ ప్రకాశన్, పౌనార్ వారు ఆయన సంపూర్ణ రచనలు 21 సంపుటాలుగా హిందీలో ప్రచురించారు. మరణానంతరం 1983లో భారతరత్న సత్కారం లభించింది.

**హృదయనారాయణ చౌధరి** (1901–72). 1921లో చదువు వదలిపెట్టి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. అనేకసార్లు జైలుకు వెళ్లారు. 1930లో న్యాయవాది వృత్తి వదలిపెట్టి సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొన్నారు. సేవాగ్రాంలో 1932లో మగన్ ఆశ్రమం ప్రారంభించారు. 1932లో ప్రభుత్వం దాన్ని జప్తు చేసిన తరువాత మహిళా విద్యాపీఠ్ ప్రారంభించారు. కొన్నేళ్లపాటు గాంధీసేవాసంఘ్‌లో పనిచేశారు. 1952 నుంచి బీహార్ శాసనసభలో సభ్యులుగా ఉన్నారు. 1957–62 మధ్యలో ఉపమంత్రిగా పనిచేశారు.

**శంకర్‌రావ్ దేవ్** (1871–1958). ప్రముఖ గాంధేయవాది. మహరాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులు. సర్వసేవాసంఘ్‌కు ప్రధానకార్యదర్శి. 1951లో భారత–చైనా సౌహార్ద్రయాత్రకు శ్రీకారం చుట్టారు.

**మగన్‌భాయి దేసాయి** (1899–1969). ఖేడా జిల్లాలోని నడియాద్‌లో జన్మించారు. దండియాత్రలో పాల్గొన్నవారిలో ఒకరు. గుజరాత్‌విద్యాపీఠానికి 1937 నుంచి 61 దాకా ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రారుగా పనిచేశారు. కొంతకాలం పాటు గుజరాత్ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా పనిచేశారు. 'హరిజన్' పత్రికకు సహసంపాదకులుగా, 'సత్యాగ్రహ' వారపత్రికకీ, 'శిక్షణ్ సాహిత్య' అనే పత్రికకూ సంపాదకులుగా పనిచేశారు. హిందీ–గుజరాతి నిఘంటువు రూపొందించారు. 'సత్యాగ్రహమీమాంస' అనే రచన కూడా చేశారు.

**భావు ధర్మాధికారి** (1899–?). స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటానికి కళాశాల చదువు వదలిపెట్టారు. 1930–42 మధ్యకాలంలో ఎన్నోసార్లు జైలుకెళ్లారు. పశ్చిమ మహరాష్ట్ర ప్రాంతంలో శంకర్‌రావ్ దేవ్ నాయకత్వంలో గాంధేయభావాలు వ్యాప్తిచేశారు. 1935లో నాగపూర్‌లో తిలక్‌విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1946 దాకా గాంధీ సేవాసంఘ్ సభ్యులుగా కొనసాగారు. నాగపూర్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఎన్నో ఏళ్లు పనిచేశారు. ఇప్పుడు మధ్యప్రదేశ్‌గా పిలవబడుతున్న సెంట్రల్‌ప్రావిన్స్ అసెంబ్లీలో 1946–56 మధ్యకాలంలో సభ్యులుగా ఉన్నారు. రాజ్యాంగనిర్ణాయక పరిషత్‌లో సభ్యులు. సర్వోదయభావాల వ్యాప్తికి పేరెన్నికగన్న వ్యక్తి. నిర్మాణాత్మక కార్యక్రమాలకు మూలస్తంభం వంటివారు.

**దాదా ధర్మాధికారి** (1899–1985). సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనటానికి నాగపూర్‌లో ప్రభుత్వకళాశాలను బహిష్కరించి తదనంతర విద్యకోసం రాష్ట్రీయ

విద్యాలయంలో చేరారు. గాంధీ చేపట్టిన ప్రతి ఉద్యమంలోనూ పాల్గొన్నారు. 1930, 1932, 1942ల్లో కారాగార శిక్ష అనుభవించారు. వివిధ ఉద్యమాల గురించి ప్రజలకు జయప్రదంగా చాటిచెప్పగలిగారు. సహాయనిరాకరణోద్యమంలో విశ్వవిద్యాలయ విద్యను తిరస్కరించి నాగపూర్‌లో తిలక్‌రాష్ట్రీయశాలలో బోధించారు. 'సర్వోదయ' పత్రికకు సహసంపాదకులుగా వ్యవహరించారు. 'స్త్రీపురుష్ సహజీవన్' మొదలైన ఎన్నో పుస్తకాలు అసంఖ్యాకంగా రచించారు. రాష్ట్రీయయువక్ సంఘ్‌ను స్థాపించారు. గాంధేయ సిద్ధాంతాలకు వ్యాఖ్యాతగా, వక్తగా జీవించారు. గాంధేయసంస్థల్తో సహా, ఎక్కడా, ఎప్పుడూ ఏ పదవీ స్వీకరించలేదు.

**రఘునాథ్ శ్రీహరి ధోత్రే** (1897–1967). ఆచార్య వినోబాభావేకు సహాధ్యాయి. వినోబాతో పాటే వార్ధాలో అడుగుపెట్టారు. గాంధీస్మారకనిధికి రెండవకార్యదర్శి. గాంధీసేవాసంఘ్ ప్రారంభించినప్పటినుంచి ఆమరణాంతం కార్యదర్శిగా పనిచేశారు. గొప్ప నేతగాడు. నిపుణుడైన ఉపాధ్యాయులు. సేవాగ్రాం సమావేశానికి సమావేశకర్తగా పనిచేశారు.

**ఆర్.ఆర్.దివాకర్** (1894–1990). కర్నాటకు చెందిన ప్రముఖ గాంధేయవాది. ఢిల్లీలో గాంధీ పీస్ ఫౌండేషన్‌కు అధ్యక్షుడు. ప్రసిద్ధ గాంధేయవాద రచయిత, వక్త. కేంద్రమంత్రిగా, 1952–57 మధ్యకాలంలో బీహార్ గవర్నర్‌గా పనిచేశారు. అణు ప్రయోగాలను నిరసిస్తూ 1962లో అమెరికా, బ్రిటన్‌లలో రాజాజీ చేపట్టిన యాత్రలో ఆయనకు తోడుగా ఉన్నారు.

**దేవదాస్ గాంధీ** (1900–57). మహాత్ముడి కనిష్ఠపుత్రులు. 1931లో లండన్‌లో రెండవ రౌండ్‌టేబుల్ సమావేశానికి గాంధీకి తోడుగా వెళ్లారు. జాతీయోద్యమకాలంలో ఎన్నోసార్లు జైలుకు వెళ్లారు. 1930ల మధ్యకాలం నుండి 1957లో మరణించేదాకా 'ద హిందూస్థాన్ టైమ్స్'కు మేనేజింగ్ ఎడిటర్‌గా ఢిల్లీలో పనిచేశారు. అఖిలభారత వార్తాపత్రికల సమావేశానికి ఒక విడత అధ్యక్షులుగా పనిచేశారు. గాంధీస్మారకనిధి స్థాపనకు ప్రధాన చోదకశక్తి. ప్రపంచవ్యాప్తంగా గాంధీపై తీసిన వివిధ రకాల ఫిల్ములను గాంధీ ఫిల్మ్ కమిటి అధ్యక్షుడుగా సేకరించారు. తదనంతర కాలంలో విఠల్‌భాయి ఝువేరి, రిచర్డ్ అటెన్‌బరోలు తీసిన సినిమాలకు ఆ సేకరణ ప్రాతిపదికగా ఉపయోగపడింది.

**పురుషోత్తమ్ గాంధీ** (1909–2004). గాంధీకి మునిమేనల్లుడు. నారన్‌దాస్ కె.గాంధీ కుమారుడు. నిర్మాణోద్యమకార్యకర్త. రాజ్‌కోట్‌లో రాష్ట్రీయశాలకు చెందిన విద్యావేత్త.

**డా.ప్రఫుల్‌చంద్ర ఘోష్** (1891–1983). 1917లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీని కలిసి పాల్గొన్నారు. 1921లో సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. డా.సురేష్‌చంద్ర బెనర్జీతో కలసి కొమిల్లా కేంద్రంగా నిర్మాణాత్మక కార్యక్రమం

కోసం అభయ్ ఆశ్రమం ప్రారంభించి దాని శాఖలు బెంగాల్ అంతటా విస్తరింపచేశారు. బెంగాల్ ప్రొవిన్షియల్ కాంగ్రెస్‌కమిటీకి కార్యదర్శిగా పనిచేశారు. గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమం, చర్ఖావ్యాప్తికి కృషి చేశారు. పశ్చిమబెంగాల్‌కు మొదటి ముఖ్యమంత్రి.

**డా.జాకీర్ హుస్సేన్** (1897-1969). ఢిల్లీలో జామియామిలియాఇస్లామియాకు ప్రిన్సిపాల్. హిందుస్థానీ తాలీమీసంఘ్‌కు అధ్యక్షులు. 1962-67 మధ్యకాలంలో బీహార్ గవర్నరు. భారత ఉపరాష్ట్రపతి. 1967 మే 13 నుండి 1969లో మరణించేదాకా భారత రాష్ట్రపతి. 1963లో భారతరత్న పురస్కారగ్రహీత.

**శ్రీకృష్ణదాస్ జాజూ** (1882-1955). గాంధీకి అంకితమైన కార్యకర్త. 1921లో తన న్యాయవాద వృత్తి వదులుకుని ఖాదీవ్యాప్తి కోసం గాంధీతో కలసి పనిచేశారు. జమ్నాలాల్ బజాజ్‌కు సలహాదారుగా గ్రామోద్యోగసంఘం నడిపించారు. చర్ఖాసంఘ్‌కు కార్యదర్శిగా పనిచేశారు. భూదానోద్యమంలో కూడా చురుగ్గా పాల్గొన్నారు.

**కాకా సాహెబ్ కాలేల్కర్** (1885-1981). అసాధారణ జ్ఞాని, రచయిత. టాగూర్‌పట్లా, మహాత్మునిపట్లా కూడా ఆకర్షితులైనారు. ఉపాధ్యాయులు. సంస్కర్త. ప్రభావశీలచింతకులు. గాంధీ గురించి సాధికారికంగా వ్యాఖ్యానించగలవారిగా, రచయితగా మన్నన పొందినవారు. రాజ్యసభసభ్యుడుగా నామినేట్ అయ్యారు. వెనుకబడ్డతరగతుల కమిషన్‌కు అధ్యక్షుడుగా ఉన్నారు. గుజరాతీలో, మరాఠీలో ఎన్నో పుస్తకాలు రాశారు.

**రాజకుమారి అమృతకౌర్** (1889-1964). గాంధీకి అత్యంత విధేయసహచరుల్లో ఒకరు. కపూర్‌థలా రాజకుటుంబానికి చెందిన వ్యక్తి. పంజాబ్‌లో సంఘసేవా కార్యకర్త. 1929లో ఆలిండియాఉమెన్స్‌కాన్ఫరెన్స్‌లో సభ్యులుగా చేరి తరువాత కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆలిండియా ఉమెన్స్ ఎడ్యుకేషన్ ఫండ్ అసోసియేషన్ స్థాపనకు ప్రధాన కారకులు. న్యూఢిల్లీలో లేడిఇర్విన్ కళాశాల ప్రారంభించడానికి కృషిచేశారు. ఉప్పుసత్యాగ్రహంలో, క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. భారతదేశానికి మొదటి ఆరోగ్యమంత్రి.

**బి.జి.'బాలాసాహెబ్' ఖేర్** (1888-1957). ఉదారవాద రాజకీయ సిద్ధాంతాలకు చెందిన ప్రసిద్ధన్యాయవాది. 1930-45 మధ్యకాలంలో శాసనోల్లంఘనోద్యమంలో పనిచేశారు. నాలుగుసార్లు జైలుకు వెళ్లారు. ముంబయి రాష్ట్రానికి 1937-9లో మొదటి ముఖ్యమంత్రిగా, తిరిగిమళ్లా 1946-52 మధ్యకాలంలో ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1952-4 మధ్యకాలంలో బ్రిటన్‌లో భారత హైకమీషనర్‌గా పనిచేశారు. అఫిషియల్‌లాంగ్వేజి

కమిషన్‌కు అధ్యక్షులుగా. 1956లో గాంధీస్మారకనిధి అధ్యక్షులుగా పనిచేశారు. 'లోకమాన్య' అనే మరాఠీ దినపత్రికకు, 'గాంధీమార్గ్' అనే మరాఠి పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. 1954లో పద్మవిభూషణ్ పురస్కారం పొందారు.

**ఆచార్య జె.బి.కృపలాని** (1888–1982). ముజఫర్‌పూర్ కళాశాలలో ఇంగ్లీషు, చరిత్ర ఆచార్యులు. 1915లో గాంధీని మొదటిసారిగా శాంతినికేతన్‌లో కలిశారు. 1920లో గాంధీ ప్రారంభించిన సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1934–45 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1946లో కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాజ్యాంగనిర్ణాయకపరిషత్ సభ్యులుగా ఉన్నారు. 1952–71 మధ్యకాలంలో లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు. భారత రిపబ్లిక్‌లో పేరెన్నికగన్న ప్రతిపక్ష నాయకుల్లో, అసమ్మతివాదుల్లో, స్వేచ్ఛాచింతకుల్లో ఆయనకూడా ఒకరు.

**సుచేత కృపలాని** (1908–74). ఆలిండియా కాంగ్రెస్ కమిటీ స్త్రీ విభాగం బాధ్యతలు చూసేవారు. 1950–02 మధ్యకాలంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు. 1952–62 మధ్యకాలంలో లోక్‌సభ సభ్యులు. 1963 అక్టోబరు నుంచి 1967 మార్చి దాకా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి. భారతదేశంలో అటువంటి పదవిని అధిష్టించిన మొదటి మహిళ ఆమెనే. ఆచార్య కృపలానీని వివాహమాడారు.

**జైనేంద్రకుమార్** (1905–88). 1920నుంచి ఎన్నో జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చారిత్రాత్మకమైన 'జండాసత్యాగ్రహం'లో పాల్గొన్నందుకుగాను 3 నెలలు జైలుశిక్ష అనుభవించారు. సాహిత్యఅకాడమీ 1948లో ఏర్పాటుచేసిన మొదటి అత్యున్నతస్థాయీసంఘంలో సభ్యులు, ప్రసిద్ధ హిందీ సాహిత్యవేత్త, తత్త్వవేత్త. గాంధేయ తత్త్వశాస్త్రానికీ, భావాలకూ వ్యాఖ్యాత. 'అకాల్‌పురుష్‌గాంధీ' పుస్తకరచయిత. పద్మభూషణ్ సత్కారగ్రహీత.

**జోసఫ్ కొర్నీలియస్ కుమారప్ప** (1892–1960). అగ్రగామి ఆర్థికవేత్త, గ్రామీణ పరిశ్రమల ప్రచారకులు, ప్రబోధకులు. గాంధీ దండియాత్ర తరువాత శాసనోల్లంఘన సమయంలో 'యంగ్‌ఇండియా' పత్రికాసంపాదకులు. అఖిలభారతగ్రామీణపరిశ్రమలసంఘానికి కార్యదర్శి. దాని మాసపత్రిక 'గ్రామఉద్యోగపత్రిక' సంపాదకులు. ఎన్నో గ్రామీణ ఆర్థిక సర్వేలు చేపట్టారు. గ్రామీణపరిశ్రమల పరిస్థితులను అభివృద్ధి పరచటం కోసం విస్తృత కృషి చేపట్టారు. గాంధేయసిద్ధాంతాలమీద ఆధారపడ్డ ఆర్థికతత్త్వశాస్త్రం ప్రచారం చేశారు. సర్వోదయోద్యమ వెలుతురులో క్రైస్తవభావాలను పునర్వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశం చేపట్టిన ఆర్థిక రాజకీయ విధానాలను విమర్శించారు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్

చైనాను సందర్శించారు. ఎన్నో వ్యాసాలూ, కరపత్రాలూ, పుస్తకాలు రాశారు. వాటిలో 'వై ద విలేజ్ మూమెంట్', 'ఎకానమి ఆఫ్ పెర్మనన్స్' చెప్పుకోదగ్గవి.

**తుకడోజి మహరాజ్** (1909–68). కీర్తనకారులు, జాతీయవాద సాధుపురుషులు, ఎన్నో భజనగీతాల రచయిత. క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 'గ్రామగీత' రచయిత. ఆలిండియా గురుదేవ్ మండలి స్థాపించి గ్రామీణఆరోగ్యం, శీలనిర్మాణం, స్వదేశీ, గ్రామ పునరుద్ధరణ, కుటీరపరిశ్రమల గురించి చాటిచెప్పారు.

**హరేకృష్ణ మహతాబ్** (1899–1987). 1921లో సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఒరిస్సా ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగా ఉన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఒరిస్సానుంచి సభ్యులుగా ఉన్నారు. 1952–53 మధ్యలో పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీకి కార్యదర్శిగా ఉన్నారు. 1946–50 మధ్యలో ఒరిస్సా ప్రీమియర్గా, 1956–61 మధ్యలో ఒరిస్సా ముఖ్యమంత్రిగా, 63లో లోక్సభలో ఉపనాయకుడుగా, స్వతంత్రభారతదేశపు కేంద్రకేబినెట్లో తొలిపరిశ్రమల మంత్రిగా, 1955–56 మధ్యలో మహరాష్ట్ర గవర్నర్గా ఉన్నారు.

**కిశోర్లాల్ మష్రూవాలా** (1890–1952). నిర్మాణాత్మకకార్యకర్త. 1917 నుండి గాంధీజీకి సన్నిహిత సహచరులు. స్వతంత్రదృక్పథం కలిగినవారు. సాబర్మతి ఆశ్రమంలో రాష్ట్రీయశాలలో ఉపాధ్యాయులుగా చేరి, 1920 నాటికి రిజిస్ట్రారు స్థాయికి ఎదిగారు. ఉప్పుసత్యాగ్రహంలో, క్విట్ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1934–44 దాకా గాంధీసేవాసంఘ్ అధ్యక్షులుగా ఉన్నారు. 1937లో డా.జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన నయీతాలీమ్ మీద ఏర్పాటైన కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగష్టులో గాంధీజీ చేసిన క్విట్ఇండియా ప్రసంగసారాంశాన్ని వ్యాఖ్యానించడంలో పూర్తి బాధ్యత తనదేనని బ్రిటిష్ ప్రభుత్వంవారికి సాహసోపేతంగా ఒక లేఖ రాశారు. గాంధీ మరణానంతరం 'హరిజన్' వారపత్రిక సంపాదకులు. 'గాంధీ అండ్ మార్క్స్', 'గాంధీ విచార్ దోహన్', 'జీవన్ శోధన్', 'జడమూల్ సే క్రాంతి' పుస్తకాల రచయిత. గుజరాత్ విద్యాపీఠానికి మొదటి రిజిస్ట్రారు.

**కాంతి మెహతా** (1920–?). స్వాతంత్ర్యయోధుడు. ధన్బాగ్–ఝరియా బొగ్గుగనుల ప్రాంతంలో కార్మికోద్యమ కార్యకర్త, ఐ.ఎన్.టి.యు.సి. నాయకులు. ఐ.ఎన్.టి.యు.సి. ప్రధానకార్యదర్శిగా వివిధ స్థాయిల్లో అంతర్జాతీయ కార్మికసంస్థలతో కలసి చాలాకాలం పనిచేశారు. ఇప్పుడు ఒరిస్సాలో, పూరీలో, బలియాపాండలో 'గాంధీలేబర్ఫౌండేషన్' ఆధ్వర్యంలో కార్మికసంఘాల కార్యకర్తలకు శిక్షణనిస్తున్నారు.

**గుల్జారీలాల్ నందా** (1898–1998). 1921లో సహాయనిరాకరణోద్యమంలో ప్రవేశించారు. 1922లో అహ్మదాబాద్ జౌళికార్మికుల సంఘానికి కార్యదర్శిగా చేరి 1946 దాకా పనిచేశారు. 1932లో తిరిగి మళ్లా 1942–44ల మధ్యకాలంలో జైలుశిక్ష అనుభవించారు. ముంబయి లెజిస్లేటివ్ కమిటీకి ఎన్నికయ్యారు. 1937–39 మధ్యలో ముంబయి ప్రభుత్వానికి కార్మిక, ఎక్సైజ్ శాఖలకు పార్లమెంటరీ సెక్రటరీగా, 1946–50 మధ్యకాలంలో ముంబయి ప్రభుత్వంలో కార్మికమంత్రిగా పనిచేశారు. కార్మికశాఖకూ, అంతర్గతవ్యవహారాల శాఖకూ కేంద్రమంత్రిగా పనిచేశారు. 1964, 66లో రెండుసార్లు తాత్కాలిక ప్రధానమంత్రిగా పనిచేశారు.

**జయప్రకాశ్ నారాయణ్** (1902–78). బెనారస్ హిందూవిశ్వవిద్యాలయంలో సామాజికశాస్త్ర ఆచార్యులు. కాంగ్రెస్‌లో కార్మికవ్యవహారాల బాధ్యతను స్వీకరించారు. 1932లో గాంధీ–ఇర్విన్ చర్చలు విఫలం కావటంతో శాసనోల్లంఘనోద్యమంలో ప్రవేశించారు. నాసిక్ జైల్లో నిర్బంధించబడ్డారు. జైలునుంచి విడుదలయిన తరువాత 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రారంభించారు. 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో నాయకత్వపాత్ర పోషించారు. జమీందారీల రద్దు, సహజవనరుల జాతీయకరణ, దున్నేవాడికే భూమి, కీలక పరిశ్రమల జాతీయకరణ వంటి వాటిగురించి వాదించారు. గ్రామీణపునరుద్ధరణ కోసం కృషిచేసారు. ఎన్నో పత్రాలూ, పుస్తకాలు రచించారు. భూదానోద్యమంలో పాల్గొన్నారు. భారత రిపబ్లిక్ చరిత్రలో, జవహర్‌లాల్ నెహ్రూ తరువాత, అత్యంత విశిష్టుడైన రాజకీయనేతగా కీర్తి గడించారు. జీవితాంతం 'పదవీరాజకీయాల'కు దూరంగా బతికారు. 1974–77 మధ్యకాలంలో జాతీయరాజకీయాల్లో నిర్వహించిన పాత్రకుగాను 'లోక్‌నాయక్'గా పేరుపొందారు. మరణానంతరం 1999లో భారతరత్న లభించింది.

**జవహర్‌లాల్ నెహ్రూ** (1889–1964). టాగూర్ ఆయన్ను 'ఋతురాజ్' అని వర్ణించారు. గాంధీజీ ఆయన్ను తన రాజకీయ వారసుడుగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యపోరాట బాధ్యతలకోసం న్యాయవాదవృత్తి త్యజించారు. స్వతంత్రభారత రూపకర్త. భారతజాతీయ కాంగ్రెస్‌కు 1923లో ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. 1929లో కాంగ్రెస్ లాహోర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. 1930లో, 42లో శాసనోల్లంఘనోద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటిష్‌ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరించినందుకుగాను ఎన్నోసార్లు జైలుకెళ్లారు. 1946లో తాత్కాలికప్రభుత్వానికి నాయకత్వం వహించారు. స్వతంత్రభారతదేశపు మొదటి ప్రధానమంత్రి. 1964 మే 27న తన మరణం దాకా ఆ పదవిలోనే కొనసాగారు. వృత్తిరీత్యా చరిత్రకారుడు కాకపోయినప్పటికీ, ఎన్నో ప్రభావశీల చరిత్రగ్రంథాలు రచించారు.

ప్రపంచస్థాయి రాజనీతిజ్ఞులు. అలీనోద్యమస్థాపకుడుగా అంతర్జాతీయవేదికపై మార్పుకు ప్రతీకగా నిలబడ్డారు. 1955లో భారతరత్న పురస్కార గ్రహీత.

**సుశీల పై** (1905–80). ప్రసిద్ధ గాంధేయకార్యకర్త. 1934లో వనితావిశ్రామ్ విద్యాలయ ప్రధానోపాధ్యాయిని అయ్యారు. తదనంతరం కస్తూర్‌బాస్మారకట్రస్టుకు కార్యదర్శిగా పనిచేశారు. 1947లో నోవాఖాళి జిల్లాలో పనిచేశారు.

**ఝవేర్‌భాయి పటేల్** (1894–?). సూరత్ జిల్లాలో ఓగ్‌లో జన్మించారు. 1921లో సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనటానికి ప్రభుత్వోద్యోగం వదులుకున్నారు. 1923–24 మధ్యలో తిలక్ స్వరాజ్‌నిధికి విరాళాలు సేకరించటానికిగాను విస్తృతంగా పర్యటించారు. వరాద్‌లో రాష్ట్రీయశాలకు ప్రిన్సిపాల్‌గా నేతకార్యక్రమం చురుగ్గా చేపట్టారు. రైతులనుండి భూమిశిస్తు వసూలుచేయటానికి వ్యతిరేకంగా బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ధరసాన వద్ద ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1944 తరువాత నిర్మాణాత్మకకార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టారు. వార్ధాలో అఖిలభారత గ్రామోద్యోగసంఘ్‌కు కార్యదర్శిగా కుమారప్పతో కలసి పనిచేశారు. కొన్ని ఆఫ్రికా దేశాలకు గ్రామీణపరిశ్రమలపై సలహాదారుగా వ్యవహరించారు.

**డా.రాజేంద్రప్రసాద్** (1884–1963). సుప్రసిద్ధన్యాయవాది. గాంధీ 1917లో చంపారన్‌లో మొదటి సత్యాగ్రహం చేపట్టిన రోజులనుండి ఆయనకు సన్నిహిత సహచరుడుగా ఉంటూ వచ్చారు. 1934లో, 1935లో, 1947–8లో కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. 1946–50 మధ్యలో రాజ్యాంగనిర్ణాయకపరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. మొదటి వ్యవసాయమంత్రి. 1950–62 మధ్యలో తొలి భారతరాష్ట్రపతి. 'దేశరత్న'గా కీర్తికెక్కినవాడు. పండితులు. మేధావి, రచయిత. 1962లో భారతరత్న పురస్కారగ్రహీత.

**ప్యారేలాల్** (1899–1982). 1920 నుంచి గాంధీ నేతృత్వం వహించిన అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. 1942లో మహదేవ్‌దేశాయి మృతి తరువాత గాంధీకి కార్యదర్శిగా పనిచేశారు. 1931లో దండియాత్ర చేసిన 79మంది సత్యాగ్రాహుల్లో ఆయన కూడా ఒకరు. గాంధీ జీవితచరిత్ర సంకలనాలు 'ద లాస్ట్ ఫేజ్', 'ద ఎర్లీ ఫేజ్' సంపుటాలకు ఆయనే ప్రధానరచయిత.

**వ్యోహార్ రాజేంద్రసింహ** (1900–88). స్వాతంత్ర్యయోధులు, సాహిత్యవేత్త, సంఘసేవకులు, గాంధేయచింతకులు, సర్వోదయకార్యకర్త. స్వాతంత్ర్యోద్యమంలోనూ, భూదానోద్యమంలోనూ పాల్గొన్నారు.

**జి.రామచంద్రన్** (1904–95). కేరళకు చెందిన ప్రసిద్ధ గాంధేయవాది. శాంతినికేతన్‌లో విద్యాభ్యాసం చేశారు. గాంధీవల్లా, టాగూర్‌వల్లా ప్రభావితులయ్యారు. సేవాగ్రాంలో హిందుస్థాన్ తాలీమీ సంఘ్ కార్యదర్శిగా పనిచేశారు. అఖిలభారత గ్రామోద్యోగ సంఘ్ కార్యదర్శిగా, ఖాదీకమిషన్ అధ్యక్షులుగా పనిచేశారు. తన భార్య డా.సౌందరం రామచంద్రన్‌తో కలసి గాంధీగ్రాంలో గ్రామీణవిశ్వవిద్యాలయం స్థాపించారు.

**మృదుల సారాభాయి** (1911–74). అంబాలాల్ సారాభాయి పుత్రిక. 1931లో ఉప్పు సత్యాగ్రహంలో, 1938లో రాజ్‌కోట్ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1947 దేశవిభజన కాలంలో బలవంతంగా నిర్బంధానికి గురయిన మహిళలకు పునరావాసం కల్పించడంలో ప్రధానపాత్ర పోషించారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. షేక్ అబ్దుల్లాతో కలసి జమ్మూకాశ్మీర్‌లో మానవహక్కుల సమర్థనకోసం కృషిచేశారు.

**సరళాబెన్ సారాభాయి** (1896–1975). అంబాలాల్ సారాభాయి భార్య. 1915 నుంచి గాంధీ సహచరవర్గంలో ఉన్నారు. విదేశీవస్త్ర బహిష్కారానికి స్త్రీలను సమాయత్తపరిచారు. కస్తూరిబా మెమోరియల్ కమిటీలో సభ్యులుగా, సాబర్మతిఆశ్రమ ధర్మకర్తగా పనిచేశారు.

**స్వామి సత్యానంద** ఆదివాసులతో కలసి పనిచేసి వారి ఆరోగ్యం, పారిశుద్ధ్యం విషయాలపై దృష్టి పెట్టారు. రాజేంద్రప్రసాద్‌ఆశ్రమానికి స్థాపకఅధ్యక్షులు. థక్కర్‌బాపా ఆదివాసి మండల్ నిర్వహించారు.

**మున్నాలాల్ శాహ్** (1901–74). 1928లో పన్నుల చెల్లింపుకు వ్యతిరేకంగా ఉద్యమించారు. దండియాత్రలో గాంధీజీని అంకలేశ్వర్‌వద్ద కలుసుకున్నారు. ఆయన ఆదేశాల ప్రకారం ఖాదీకార్యక్రమం చేపట్టారు.

**పండిత్ సుందర్‌లాల్** (1859–1918). నైనటాల్ జిల్లాలో జస్పూర్‌లో ఒక గుజరాతీ కుటుంబంలో జన్మించారు. కలకత్తా విశ్వవిద్యాలయంనుంచి పట్టభద్రులయ్యారు. పండిత్ మోతీలాల్‌నెహ్రూ, పండిత్ మదన్‌మోహన్‌మాలవ్యా, సర్ తేజ్‌బహదూర్ సప్రూ, డా.అనిబిసెంట్లకు సహచరుడుగా పేరు పొందారు. 1914లో ఔధ్‌లో జుడిషియల్ కమిషనర్‌గా పనిచేశారు. అలహాబాద్ హైకోర్టుధర్మాసనానికి నియమితులయ్యారు. అలహాబాద్ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్స్‌లర్‌గా మూడుసార్లు పనిచేశారు. అటువంటి నియామకం పొందిన మొదటి భారతీయుడు ఆయనే.

**ఎ.వి.థక్కర్ (థక్కర్‌బాపా)** (1869–1951). బొంబయి మున్సిపాలిటీలో ఇంజనీర్‌గా పనిచేస్తూ ఆ ఉద్యోగం వదలిపెట్టి, 1914లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో చేరారు.

1923లో దోహద్‌లో భిల్‌సేవాసంఘ్ ప్రారంభించారు. ఆదివాసుల విషయాల్లో, 'అస్పృశ్యతా' నిర్మూలనా కార్యక్రమంలో గాంధీకి నమ్మకమైన సహచరులు. 1932లో గాంధీ చారిత్రక నిరాహారదీక్ష కాలంలో జరిపిన సంప్రదింపుల్లో ప్రధానపాత్ర పోషించారు. తద్వారా పూనా ఒప్పందానికి కారకులయ్యారు. హరిజన్ సేవక్‌సంఘ్ ప్రధాన కార్యదర్శిగా, కస్తూరిబాగాంధీ జాతీయస్మారకనిధి వ్యవహర్తగా, ప్రస్తుతం వనవాసి సేవామండల్‌గా పిలవబడుతున్న గోండ్‌సేవక్‌సంఘ్ స్థాపకులుగా పనిచేశారు. రాజ్యాంగనిర్ణాయక పరిషత్‌కు ఎంపికయ్యారు.

**కొండా వెంకటప్పయ్య** (1866–1949). గుంటూరులో ఒక బీదకుటుంబంలో జన్మించారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో బి.ఏ., 1891లో బి.ఎల్. పూర్తిచేశారు. 1887లో భారత జాతీయకాంగ్రెస్‌లో ఒక కార్యకర్తగా పనిచేశారు. సామాజిక, స్త్రీజనోద్ధరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధ గాంధేయవాది. గాంధీ సహచరులు. ఆంధ్రప్రాంతంలో రాజకీయ బాధ్యతలు స్వీకరించి, కాంగ్రెస్ చేపట్టిన అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు.

# ప్రారంభ చర్చ

## సేవాగ్రాం సమావేశం



**గురువారం 11 మార్చి 1948**

**ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా**

రఘునాథ్ శ్రీహరి ధోత్రే : మన సమావేశం 13వ తేదీన మొదలవుతుంది. దాన్ని పండిట్ జవహర్‌లాల్ ప్రారంభిస్తారు. అధ్యక్షబాధ్యతలు రాజేంద్రబాబు చూసుకుంటారు. సర్దార్ వల్లభభాయి పటేల్ రాలేకపోవచ్చునుకుంటాను. ఆయన ఆరోగ్యం బాగాలేదు. మన సమావేశం ముందున్న ప్రధానవిషయమిది:

'బాపు ఇక మన మధ్య లేరు. ఆయన మనకు చెప్తూ వచ్చిన విషయాలు – ఆయన బోధనలు – నేడు నిజంగా మనకు విలువైనవేనా? కాదా?'

అహింసను నమ్ముతున్న వాళ్లు నేడు పోషించవలసిన పాత్రగానీ, వాళ్ల స్థానంగానీ ఈరోజు ఎలా ఉంది? మనం మన నమ్మకాలలోతుల్లోకి తొంగిచూసి మరీ ఈ ప్రశ్నకు జవాబు వెతుక్కోవాలి.

వినోబా : అసలు ముందు మన నమ్మకాలు ఎంత బలంగా వున్నాయో చూసుకోవాలి.

ధోత్రే : ఈ మధ్య మన దేశం అగ్రశ్రేణి సైనికశక్తిగా ఎదగాలనీ, ప్రపంచంలోనే అత్యున్నత సైన్యసంపద కలిగిన జాతిగా విలసిల్లాలనీ రకరకాల మాటలు వినవస్తున్నవి. ఈ ఆలోచన బాపూజీ ముందు పెట్టినప్పుడు ఆయన దిగ్భ్రాంతికి గురయిన విషయం నాకిప్పటికీ గుర్తుంది. అప్పుడు మేం పాట్నాలో ఉన్నాం. 'ఒక సైనికశక్తిగా భారతదేశ'మనే అంశంమీద తానొక ప్రసంగ పరంపర చేపడతాననీ, దాదాపు పది ప్రసంగాలు దాకా చేయాలనుకుంటున్నాననీ చెప్పటం నాకు గుర్తొస్తోంది. కాని ఆయనకా అవకాశం రాలేదు.

ప్రఫుల్లచంద్ర ఘోష్ : ఒక శాస్త్రవేత్త దృక్పథం నుంచి నేనోమాట చెప్పగలను. మన ప్రభుత్వం భారతదేశాన్ని అత్యున్నతస్థాయి సైనికశక్తిగా మార్చాలనుకుంటే మనం తప్పకుండా సైనికీకరణ వ్యామోహంలో కూరుకుపోతాం. అప్పుడు మనం అమెరికాకో, రష్యాకో పూర్తిగా లొంగిపోవలసి ఉంటుంది. అక్కడితో మన స్వాతంత్ర్యం అంతరించిపోతుంది. మనం పదేళ్లపాటు కష్టపడ్డాకూడా ఒక ఆటంబాంబు తయారుచేయలేం. ఒక పావుశతాబ్దపు కాలంపాటు మనం సాధించగల ప్రగతి కేవలం రెండు ఆటంబాంబులు తయారు చేయటంతో అంతరించిపోతుంది. మనం చేయవలసిందిది కాదు, మనం మన ప్రజల్ని అహింసాసిద్ధాంతం పట్ల చైతన్యవంతుల్ని చేయాలి.

రాజేంద్రప్రసాద్ : అహింసాత్మక సమాజాన్ని సృష్టించడమే మన ధ్యేయం. దానిమీద కొత్తగా చర్చించవలసిందేమీ లేదు.

వినోబా : ప్రజలుగానీ, ప్రభుత్వంగానీ అహింసకు అనుకూలంగాలేని పరిస్థితుల్లో మన విశ్వాసాలు మనకేం చెప్తున్నాయి? మనం కూడా సాధారణ సమాజస్థాయికి దిగి దాని హింసాత్మక పద్ధతులు అందిపుచ్చుకోవాలా, లేక మన విశ్వాసాలకే మనం కట్టుబడి ఆత్మత్యాగం చేయాలా? అటువంటి త్యాగం చేయకతప్పదనే నా విశ్వాసం నాకు చెప్తోంది. కాని మనకటువంటి త్యాగం చేయటానికి చాలినంత బలం లేకపోతే మనమేం చేయాలి? మనం కూడా పిరికివాళ్ల దారి పట్టాలా? లేక అసలు ప్రతిఘటించడమే మానేయాలా?

కాకా కాలేల్కర్ : అహింసాత్మక తపస్సు మన ఋషులపద్ధతి. అది బాపూ పద్ధతి కాదు. మనం మనుషులమధ్య జీవిస్తున్నాం. రాజ్యం నుంచి రక్షణ పొందుతున్నాం. ఒక్కవ్యక్తి అయితే ఏదో ఒక తపోవనాన్నెంచుకొని ఏ అరణ్యఏకాంతంలోనో ఆంతరంగిక ప్రశాంతి పొందవచ్చుగానీ, ఒక సంస్థలో భాగంగా, లేదా ఒక విస్తృతప్రజా సమాజంలో భాగంగా మాత్రం అతడా పని చేయలేడు.

వినోబా : నేను చెప్తున్నదల్లా ఒకటే. అహింసాత్మక పద్ధతులు పాటించడానికి నాకు అవకాశం లేకపోయినప్పుడు నేను నిష్క్రియాత్మకంగా ఏ మూలకో ఒదిగి తపస్సు చేసుకోక తప్పదనే. కాబట్టి మనకు నిష్క్రియాత్మకత తప్పదందామా?

ఆ మాటకొస్తే నిశ్శబ్దంగా కూర్చోడం కూడా ఒకరకమైన తపస్సే. దానికి కూడా కొంత యోగశక్తి కావాలి. కాని ఎటువంటి పరిస్థితుల్లోనూ కూడా మనం చేయకూడని పనులు రెండున్నాయి: 1. మననిమనం కించపరచుకుని, తక్కిన సమాజంతో